# గృహోన్ముఖుడు

శ్రీ తాడిగిరి పోతరాజు

మునిసిపాలిటీ కార్యాలయంనుంచి బ్రహ్మరాక్షసిలా కేక పెట్టింది 'సైరను'. రాత్రి ఎనిమిది గంటలయిందని గ్రహించి, అందరూ త్వర త్వరగా తమ తమ కార్యకలాపాలు ముగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. అప్పటివరకూ కార్యసాధనలో నిమగ్నులై ప్రపంచాన్ని మరచిపోయినవ్యాపారస్తులు, రాజకీయ వేత్తలు, సైరను చెవుల్లో 'గింగురు' మనేసరికి త్రుళ్లి పడి, ముంజేతి వాచీ చూసుకొని, ఒకరివద్ద ఒకరు సెలవుతీసుకోవటానికి ఉపక్రమించారు. దుకాణాదారులు, డబ్బు లెక్క పెట్టుకొని, కొట్లు మూస్తున్నారు.

పగటివేళ ఆ బజార్లతోనున్న అవసరాన్ని రేపటికి వాయిదా వేసి అందరూ సర్దుకుంటూన్న వేళలో, ఆ ప్రదేశానికి వింత వ్యక్తులు, కొత్త వ్యక్తులు పోగవుతున్నారు. రాత్రించరులను ఆహ్వానించటానికై వికృతంగా తీగెలు చుట్టుకొని నిల్చున్నాయి విద్యుద్దీప స్తంభాలు. ఉదయం ఆఫీసులకు బయలుదేరే ప్రభుత్వోద్యోగుల్లా జారులు, చోరులు మెయిన్‌రోడ్డు ప్రవేశిస్తున్నారు. వీరి కార్యసాధనకు అనుకూలసమయ మీ నిశీథిని. వీరితోపాటుగా, వీళ్ళ సవతిపిల్లలైన పోలీసులు ధర్మరక్షణార్థమై, ప్రజాక్షేమం కొరకు, విజిల్స్ వేసుకొంటూ, సంజ్ఞలు చేసుకొంటూ జాగరణకు సిద్ధపడుతున్నారు.

ప్రతిరోజూ, ఈ వేళకు, ఈ రెండువర్గాలకు చెందిన మానవులు ఆఊరిలో ఆ సినిమాహాలు ముందున్న సత్రంవద్ద సమావేశమౌతూంటారు.

ఆ సత్రం రెండస్థుల మేడ. క్రిందిభాగంలో అరఫర్లాంగుపొడుగునవున్న ఆ పంచపాళిలో నానా జాతిసమితి సమావేశం జరుగుతూంటుంది. ఆ పంచకు ముందు భాగాన, శిథిలమై చిల్లులు పడిపోయి జీరాడుతున్న మురికిగోనెపట్టాలు వ్రేలాడుతున్నాయి. వాటి చెంతనే, అతుకులు వేసిన కావిగుడ్డలు, చీరెలు ఆరకట్టబడివున్నాయి.

సత్రంలో జనంమాత్రం పల్చగనే వున్నారు. అక్కడక్కడ ఓ సన్యాసి, మురికిగుడ్డలమూటలు, వాటి చెంతనే నగ్నశరీరులై నిద్రిస్తూన్న అనాథపిల్లలూ, తప్ప మరెవ్వరూ లేరు. ఆ సత్రాన్ని చిరకాలంగా కనిపెట్టుకొని బ్రతుకులు సాగిస్తున్న మహానుభావు లందరూ, ఇంతకుపూర్వమే "మాదాకవళం తల్లీ!" ఉద్యమంలో పాల్గొనటానికి వెళ్ళారు. ఇప్పుడా ఉద్యమ నాయకు లందరూ, జట్లు జట్లుగా చేరుకుంటున్నారు. అంధులు, అంగవికలులు, కుష్ఠురోగులు, వర్గభేదం పాటించి, ఎవరి నిర్ణీతస్థలాల్లో వారు ఒదిగి కూర్చుంటున్నారు.

వీరు కాక భిక్షాటన చేసినవారు క్రిందనున్న మురుగుకాలువ చెంతనే వంటప్రయత్నం సాగిస్తున్నారు. పొయ్యిక్రింద మంటకొరకు కారుటైరుముక్కలు, చెత్తచెదారం ప్రోగుచేసి, కాల్చుతున్నారు. వాళ్ళకు సమీపంగా 'డస్ట్‌బిన్'లో చేరి రెండుపందులు మామిడివిత్తనాలు కొరుకుతున్నాయి. మందంగా నిశ్చలంగా ప్రవహిస్తూన్న ఆ మురుగుకాలువ, అదోకరకమైనదుర్గంధాన్ని వెదజల్లుతోంది. కాలుతున్న ఆ టైరుముక్కలు అదోకరకం కంపుకొడ్తున్నాయి. ఏ వాసన ఘాటుగావుందో నిర్ణయించలేక బాటసారులు ముక్కుకు 'రుమాలా' అడ్డంపెట్టుకొని నడక సాగిస్తున్నారు. అయితే ఆ వాసన, అక్కడ అరుగుపై ఆసీనులైన వ్యక్తులపై ఏలాటి ప్రభావం చూపలేదు. ఒక్కరు తప్ప అందరూ, అనేక అనుభూతులతో, స్మృతులతో, నిర్లక్ష్యంగా కూర్చున్నారు, మామూలుగా పార్కులో కూర్చున్నట్లు. ఆ వ్యక్తి ఎదురుగానున్న దిమ్మకు కాళ్ళుతన్ని పెట్టి, తలక్రింద ఒక పాతగుడ్డల మూట పెట్టుకొని కళ్ళుమూసుకున్నాడు. రబ్బరు కాలుతున్న వాసన భరించలేక "ఛీ...పాడు గవులు...గబ్బుకొడుతోంది...ఎవడ్రా అక్కడ" అని గర్జించాడు. ఆ దెబ్బతో, అక్కడచేరిన దైవస్వరూపులందరూ అటు కేసి చూశారు. మెఱుపులావచ్చి ఆ పొయ్యి వెలుగు అతనిముఖంపై పడింది. కోడేరులా ఇంత పొడుగు ముక్కు, రెల్లుదుబ్బుల్లావున్న కనుబొమలు కుంచించుకు పోయాయి. గుంటలుపడిపోయి, జ్యోతుల్లా మెరుస్తున్నాయి కళ్ళు. వెలుగు ముఖంపై బడగానే కను

రెప్పలు ముకుళించాయి. బాధగా కళ్లుమూసికొన్నాడు. దవడ ఎముకలు ఎత్తుగా ఉబ్బి బయటికి పొడుచుకొస్తున్నాయి. "నుంటు ఆగుతున్నానులే!" భయకంపిత స్వరంతో. దీనంగా సమాధానమిచ్చింది ఒక కంఠం పొయ్యిదగ్గరనుంచి. దానితో తృప్తిపడి ఆవ్యక్తి మళ్ళీ వెనుకకు చేరగిలపడ్డాడు. అయినా విసుగు, కోపం తగ్గలేదు. "ఎదవసత్రం...ఎదవసత్రం" అని గొణుక్కున్నాడు.

అంతలో అక్కడకు మరొక బికారి చేరాడు. పడుకున్న ఆ వ్యక్తికేసి కోపంగా చూశాడు. కాని పడుకున్న వ్యక్తికి ఆ చూపు కన్పించలేదు. ఇక లాభం లేదనుకొని "ఏయ్? ఎవరు నువ్వు? నాసోట్లోనుంచి లే" అన్నాడు.

పడుకున్న వ్యక్తి కదలలేదు. పలుకలేదు.

"నీకేనోయి చెప్పేది. లేస్తావా! లేవ్వా?" అని రెట్టించాడు, ఆస్థలం వాడి 'జన్మహక్కు' యినట్లు. మళ్ళీ రెండుసార్లు పిలిచాడు.

ఈసారి పడుకున్న వ్యక్తికి ఒళ్లు మండిపోయింది. చివ్వునలేచాడు సిగ్నలు రేకులా... "లేవనోయ్...ఏం చేస్తావేం?" అని హుందాగా రొమ్ము విరుచుకొని పలికాడు.

ఆ రడుగులమనిషి కసాయివాడి భంగిమలో లేచి నిల్చునేసరికి గుండె జల్లరించింది. కాని ఇప్పుడు నోరు, మూసుకూర్చుంటే, అందరిదృష్టిలో రేపు పల్చనయిపోతాడు. ఈ ఆలోచన తట్టగానే కోపం పొంగిపోయి "టూత్ పేస్టు"లా బయటికొచ్చింది. "ఈసోట్లో రోజూ నేపడుకుంటున్నాను......ఇప్పుడు నువ్వు లేస్తావా? లేవ్వా?" అన్నాడు సమస్యా పరిష్కారానికి ఏదో మార్గం కనిపెట్టినట్లు: "లేవనని నీ కెన్నిసార్లు చెప్పాలోయ్?...కావలంటే ఒకదెబ్బ చూసుకో" అని క్రోధావేశమూర్తియై పిడికిలిబిగించి, చెయ్యిపైకెత్తి గోడపై ఆన్చాడు.

రెండవవ్యక్తి పోల్చిచూస్తే పొట్టిమనిషి. అతను చెయ్యిపైకెత్తగనే గుండెలాగినంత పనయింది. శరీరం కంపమెత్తింది, అయినా ధైర్యంచేసి "ఏమిటోయ్? కాస్త జరగవయ్యా! అంటే పెద్ద వస్తాదులాగ మాటాడతావ్...ఎంతమందిని కొడతావు నువ్వు?...అసలు నేనెవర్నో తెలుసా...జాగ్రత్త..."అంటూ తన గళ్ల లుంగీ సగానికిమడచి నడుంపై చుట్టుకున్నాడు. తరువాత చేతులు పైకి తీస్తున్నాడు.

ఇంతలో ఓటాక్సీ ఆ సత్రంముందుగా దూసుకుపోయింది. అప్పుడా కారుదీపపుకాంతులు ఒక్కక్షణం వాళ్ళమీద ప్రసరించి, ఆ దిమ్మెలనన్నిటినీ వరుసగా దాటిపోయాయి ఆ కాంతిలో. రౌద్రమూర్తియై, విలయతాండవానికి సిద్ధమై పెదిమలు కరచిపట్టుకున్న మొదటివ్యక్తి ముఖాన్ని రెండవవ్యక్తి సుస్పష్టంగా చూశాడు. నరాలు పెలుబికి, శరీరకష్టం స్ఫురింపచేసే అతని దృఢకాయం. రెండవవ్యక్తిలో గతస్మృతులను తట్టిలేపింది. కాని ఇప్పుడా ఆలోచనకు తావులేదు. కాని ఆ స్మృతితో భయం ఉద్ధృతమైంది.

ఇద్దరూ ఆభంగిమలో నిల్చుని, ముష్టి యుద్ధానికి సన్నద్ధులౌతూంటే, తక్కినవాళ్ళంతా నిష్పాక్షికంగా ఐక్యరాజ్యసమితి పర్యవేక్షకబృందంలా పరిశీలిస్తున్నారు. ఆ పరిస్థితులలో ఒక అంధుడు కలుగజేసికొని "ఏమయ్యా? ఈసోటు మీ ఇద్దరిలో వొరిదీకాదు... రవ్వంత కునుకుతీసి పొద్దున్నే పొయ్యేవాళ్ళ కెందుకీ కొట్లాట...అరుసుకోవటం" అని తీర్పుచెప్పాడు. ఆ తీర్పులో జాలి, శాంతిప్రియత్వంకన్న "పోలీసుల భయం" ఎక్కువగా ప్రతిధ్వనించింది.

ఇంతలో మరోకారు ఆరోడ్డున వెళ్లటంవల్ల, ఆ సత్రంలో మసిబొగ్గుతో గీయబడిన, పెద్దపులి, పోలీసు, కోడిపుంజు, కత్తిసాముచేస్తున వీరులు — మొదలైన చిత్రాలు కన్పించాయి. పోలీసుబొమ్మ చూచి అందరికీ భయం వేసింది. వచ్చాడంటే అందర్నీ వెళ్ళకొడ్తాడని స్ఫురించగనే ఎవరితావులకు వారు వెళ్ళిపోయారు.

ఆ పెద్దపులిబొమ్మ జూచి కలవరపడ్డాడా రెండో వ్యక్తి. ప్రేక్షకబృందం రాజీనామా యివ్వటంతో పోరాటంలో పాల్గొంటూన్న అభ్యర్థులు వెంటనే, కాలిపోయిన గడ్డివాముల్లా క్రిందకొరిగి దూరబారంగా చతికిలబడ్డారు.

* * * *

ఆ గళ్ళలుంగీవ్యక్తికి నిద్రబట్టలేదు. గతానికి సంబంధించిన ఎన్నో దృశ్యాలు మురికికుప్పపై ముసురుతున్న దోమల్లాగా కళ్ళముందు మెదలసాగాయి. ఏడు సంవత్సరాలక్రితం, తను ఒకబాలిక మెడలో గొలుసు అపహరించిన నేరానికి కారాగారశిక్ష విధించారు. అప్పుడు తనగదికి ఎదురుగానున్న గదిలో "వీరాస్వామి" అనే ఖైదీ వుంటూండేవాడు. హత్యా నేరం ఆరోపింపబడి ఎలానో మరణశిక్షతప్పి ఇరవై సంవత్సరాలు కారాగారవాసం అనుభవిస్తున్నాడు.

# గృహోన్ముఖుడు

ఆఖైదీ ఆజానుబాహుడు. ముగ్గురు మనుషుల పెట్టున పనిచేసి, వార్డెన్లుపోసే ఆ రాగిగంజి, కుడితిలా పీల్చిపారేసి పడుకొని ఎనుబోతులా గుఱ్ఱుపెట్టేవాడు. తోటిఖైదీలందరికీ అతనంటే భయం, అభిమానం. అస్తమానం అంధకారబంధురమైవున్న ఆగుహలో పడి వుండేవాడు. సాయంత్రం, ఒకఅర్ధగంటసేపు, ఖైదీలను శృంఖలాబద్ధులను చేసి వాయుసేవనంకోసం బయటికి తోలేవారు. ఆ సమయంలో, ఖైదీలందరూ, వినోదంగా కబుర్లు చెప్పుకొని సంతోషించేవారు. అప్పుడుకూడ అతను మౌనవ్రతం చాలించేవాడుకాదు. ఎప్పుడు విడిచిపెడ్తారనే తహతహ, విముక్తుడయ్యాక ఏమిచెయ్యాలనే భావాలూ ఉద్భవించేవికావు. నిరాశ, వ్యాకులత ప్రస్ఫుటమౌతూండేవి. నున్నగాగొరిగించబడిన బోడితల, చాలీచాలని ఆగళ్ళచొక్కాతో వికారంగా వుండేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, అతను చేసిన అపరాధానికి శిక్ష అనుభవిస్తూన్నట్లు, పశ్చాత్తాపపడుతున్నట్లు కన్పించేవాడుకాదు. వెలుతురుకానీ, గాలికాని ప్రవేశింప శక్యంకాని ఆ కారాగారానికి రారాజులా గంభీరంగా వుండేవాడు.

ఒకరోజు ఖైదీలందరూ, శృంఖలాలు గలగలమని రొదచేసికొంటూ గుట్టలు గుట్టలుగాచేరి చెవులుకొరుక్కుంటున్నారు. ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ చెప్పుకొని, ముఖాలు కందగడ్డలా పెట్టుకుంటున్నారు. కొందరు నానాబూతులు తిడుతున్నారు. ఆమాటలు వీరాస్వామిలో కొంతచైతన్యం కలుగజేసినాయి. అతనిమౌనముద్ర విచలితమైంది.

"ఆడవాళ్ళవార్డులో ఒక గర్భిణిస్త్రీని జెయిలరు బలంకొద్దీ తన్నాట్ట. ఆ అక్రమచర్యవలన, పిండం దూసుకుపోయి, ఆమె మరణించింది" ఇది అసలు జరిగినసంగతి. ఆ ఘటననుగూర్చిన విశేషాలు మరీ మరీ తర్కించుకొనేలోగా, ఖైదీలు లోపలికెళ్ళవలసిన ఆవశ్యకతను సూచిస్తూ వార్డులో గంట వినిపించింది. వెంటనే వార్డెను వెళ్ళటానికి హుకుం జారీచేశాడు. సంకెళ్ళు గలగలలాడించుకొంటూ, స్వపాదవిన్యాసంతో ఆబాట ధూళీధూసరితం చేసికొంటూ, ఎవడి 'ముంత' (గంజిత్రాగేబొచ్చె) వాడు తీసుకొని, చీకటి గదుల్లో జొరబడ్డారు.

పైఘటనను పురస్కరించుకొని రెండవరోజు వార్డులో చిన్నకల్లంతు జరిగింది. జైలరు వార్డెనులను వెంటనిడుకొని పర్యవేక్షిస్తున్నాడు. ప్రతిగదిలోకీ తొంగిచూచి తాళపుకప్ప లాగి చూస్తున్నాడు. వీరాస్వామిగదిలోకి చూసి "వీడివిషయం జాగ్రత్త...పొగరుపోతు...దయదలచకూడదు" అన్నాడు. అప్పుడతని పెదవిపైనున్న కోరమీసం, మరింత సొగసుగా నాట్యం చేసింది. "దయనుగూర్చి నువ్వయినా వాళ్ళకు చెప్పరా" అన్నాడు. కోపం, అసహ్యం, బాధ సమ్మిళితమైన గొంతుతో...వీరాస్వామి.

ఆమాటలతో జెయిలరు ముఖం నల్లబడిపోయింది. "ఏమిట్రా, రాస్కెల్! దయనుగూర్చి చెప్పాలట్రా నీకు" అంటూలోపల ప్రవేశించి బెత్తంతో ఒకదెబ్బ కొట్టాడు. మళ్ళీ రెండో దెబ్బకొట్టటానికి చెయ్యి పైకెత్తాడు. కొట్టబోయ్యేసరికి, వీరాస్వామి అతని చెయ్యి లంకించుకొని క్రిందకు వంగతీశాడు. వంగతీసి, పందిమెడలా ఉబ్బిపోయిన అతని మెడపట్టుకొని రెండుమూడు నిముషాలసేపు కిక్కురుమనకుండా బలంగా ఒత్తిపట్టి...అటూ ఇటూ రెండుఊపులు ఊగించి గది బయటికి త్రోశాడు. చేతులు రెండూ అడ్డంగా గొలుసుతో పరివేష్టితమైవున్నాయికాని లేకపోతే ఈపాటికా మెడ ఇంకింతలావున వాచిపొయ్యేది.

ఆ దృశ్యాన్ని తిలకిస్తూ వార్డెనులు ఇద్దరూ స్తంభించిపొయ్యారు. జెయిలరుకంటేముందువాళ్ళిద్దరూ మూర్ఛపోయినట్లు కన్పించారు. జెయిలరు గదిబయట పడినవెంటనే వాళ్లు ఈప్రపంచంలో పడ్డారు. వెంటనే ఆఫీసరుగార్ని అదరా బాదరాగా లేవనెత్తారు. జెయిలరు లేచి మెడసర్దుకుంటూ "కాల్చిచంపేసా రేపు...పొగరుబోతు వెధవా—అసలు నీకు మరణశిక్ష విధించాల్సింది." అంటూ గది ఇవతల నిల్చుని వీరాస్వామి ముఖాన పెళ్ళుపెళ్ళున రెండుదెబ్బలు చరిచాడు.

దీనిని ఎదురుగదులలో వున్నవారు స్పష్టంగా చూశారు. చూడలేకపోయిన ఖైదీలుధ్వనులనుబట్టి పరిస్థితి ఊహించుకున్నారు. వెంటనే హర్షధ్వానాలు ప్రకటిస్తూ 'హే' అని నవ్వారు. ఆ నవ్వు భరించలేక జెయిలరు "షటప్" అన్నాడు రొప్పుకుంటూ. సీమపంది లాంటికళ్ళతో జైలుగదుల వాకిళ్ళన్నిటివేపూ ఒక చూపు విసిరాడు. క్షణంలో ఆ నవ్వు అంతర్ధానమైంది. జెయిలరు వెళ్ళిపొయ్యాక నలుమూలలనుండి, "భలే పని చేశేవురా!" అంటూ అభినందనాలు వచ్చాయి.

రెండవరోజు, హత్యాప్రయత్నమని జెయిలరు చేసిన అభియోగం ఫలితంగా వీరాస్వామికి ఐదేళ్లు కారాగారవాసం పొడిగించబడింది. దానితోపాటుగా ముప్పయి కొరడా దెబ్బలు స్వీకరించాడు.

ఈసంఘటన ఇప్పుడా గళ్ళలుంగీ వ్యక్తికి స్మృతిపథంలో నిన్న జరిగినట్లు కన్పించింది. ఇప్పుడ కేగొంటు,

పౌరుషం, కదలికలు, స్వరూపం, తనతో కుస్తీకుపక్రమించిన వ్యక్తిలో ప్రకాశిస్తున్నాయి. అయినా పల్కరించుదామనుకొని "వీరాస్వామీ!" అన్నాడు. సమాధానం లేదు. నిద్రపోతున్నాడేమో, ఎందుకులే, లేపటం మనుకొని నిశ్శబ్దంగా వూరుకొన్నాడు.

కాని ఆ మొదటివ్యక్తి అటునుంచి ఇటుపొర్లి, పచ్చిబూతులు రెండుతిడుతూ "నన్నాడనే వుండ నియ్యకూడదూ...వాళ్ళసొమ్మేం పోయింది"...... అంటూ మళ్ళీ రెండుబూతులు తిట్టాడు.

"నీపేరు వీరాస్వామికదూ?" పల్కరించాడు గళ్ళలుంగీవ్యక్తి.

కళ్లు నలుపుకుంటూ, పెద్దగా ఆవులించి "కాదు ...నాపేరు నంబరు 29" అన్నాడు క్లుప్తంగా. కాని వీరాస్వామికి ఇరవై అయిదుసంవత్సరాలక్రితంఎప్పుడో, పోయిన జన్మలో, ఆపేరువిన్నట్టు ఒక అనుభూతి కల్గింది. ఆమాట లుచ్చరించిన ముఖంకేసి నోరు తెరచుకొని పరిశీలనగా చూశాడు. కాని అంతలోనే ఏదో పనిలో నిమగ్నుడైపోయ్యాడు.

"వీరాస్వామి..."మళ్ళీ పిలిచాడు గళ్ళలుంగీ వ్యక్తి.

ఈ పేరుతో తనను ఇదివరకెప్పుడో, ఈతరానికి ముందు మనుష్యులు పిలిచినట్టు జ్ఞాపకం వచ్చింది. శిథిలమైన గోడసందులోనుండి ప్రసరిస్తూన్న కాంతికిరణంలా, తన పేరుకు సంబంధించిన స్మృతి మేల్కాంచింది. ఇరవైఅయిదు సంవత్సరాలనుండి ఇప్పుడెవ్వరూ ఆ పేరుతో పిలవటం లేదు. జైలులోవుండగా 'నంబరు ఇరవైతొమ్మి'దని పిలచేవాళ్ళు. కాసేపు తటపటాయించి అతనిపేరేదో ధ్రువపరచుకోలేక, వినవస్తూన్న కంఠస్వరంకేసి నిర్లక్ష్యంగా చూడసాగాడు.

గళ్ల లుంగీవ్యక్తికి ఏమీ పాలుపోలేదు. మతిభ్రమణాని కిది ప్రథమస్థాయి కాబోలు ననుకున్నాడు. కాని ఒక అర్ధగంటక్రితం అతనిప్రవర్తన సాధారణ మనిషిలానే వుంది. ఇదొక వేషమనుకున్నాడు. అయితే తను ఖైదీగావున్నప్పుడు, ఆతని నిజాయితీ, న్యాయబుద్ధి, సహృదయత స్ఫురణకొచ్చాయి. వేషమెయ్యవలసిన అగత్యం ఏమికల్గిందిప్పుడు. మనిషి చీకాకుగా వున్నాడేమో ననుకొని ఒకబీడి ముట్టించి అతని కిచ్చాడు. తను కూడ ఒకబీడీముట్టించి గుప్పున ఒకగుక్క లాగి మళ్ళీ ప్రారంభించాడు.

"పోనీ నీ ఇల్లెక్కడ?"

ఈసారి వెంటనే సమాధానమొచ్చింది. "జిల్లా కోర్టు వెనక" — ఒకదమ్ములాగి నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చాడు. అతను పొగపీల్చినప్పుడు బీడి చివరనున్న నిప్పుకణాలు ప్రజ్వలంగావెలిగి ఆరిపోయినాయి. ఆ ఎఱ్ఱని వెలుగులో దుమ్ముకొట్టుకున్నముక్కు, కనురెప్పలు, బోడితలపై వికృతంగా పొడుచుకువస్తూన్న వెంట్రుకలు స్పష్టంగా చూశాడు గళ్ల లుంగీ వ్యక్తి.

"పేరు, నంబరు 29. నివాసం, జిల్లాకోర్టు వెనుకనున్న ఖైదీలభవనం.—వేరే చెప్పనవసరంలేదు. ఇతను వీరాస్వామే"అని నిశ్చయించుకున్నాడు.

ఐదుసంవత్సరాలక్రితం తను బంధితుడుగానున్న ఆ కారాగారం—ఎదుటిగదిలో వీరాస్వామి - ఊప్పిరికి రాలిపోతూన్న సున్నపుగోడలు—మనవు కంపుకొట్టే ఆ చీకటిగదులు, ఒక్కసారి కళ్ళముందు గిర్రున తిరిగాయి. ఆ చీకటిలో ఇరవైఐదు సంవత్సరాలుగా, మ్రగ్గిపోయి పాలిపోయి తిరిగి ఈ ప్రపంచంలో పడిన వీరాస్వామిని చూచి జాలిపడ్డాడు. అతని నికృష్టపుబ్రతుకు తలంచుకొని, రెండు అశ్రువులు విడిచాడు దయాపూర్వకమైన గౌరవం, ప్రేమ కలిగాయి.

"అన్నం తిన్నావా వీరాస్వామీ?" బీడి నేలరాచి అవతలపారేసి అడిగాడు. వీరాస్వామి ఒక్కసారి ఇటుతిరిగిచూసి మళ్ళీ ఏదోపనిలో నిమగ్నుడయ్యాడు. వివాదం పూర్తయినప్పుడినుండే ఆ కార్యభారం నిర్వహిస్తున్నాడు. ఇప్పటికీ పూర్తికాలేదు. ఆ చీకటిలో అతనేమిచేస్తున్నాడో గళ్ళలుంగీ వ్యక్తికి అర్థంకాలేదు. అగ్గిపుల్ల గీచిచూచి నిర్ఘాంతపొయ్యాడు. మళ్ళీ రెండోపుల్ల గీచాడు.

పదిగజాల పొడవున్న చింకిగుడ్డ పీలికలను వరసగా ముడిపెడుతూ వేస్తున్నాడు. ఇప్పటికి దాదాపు కొన్నివందల ముళ్ళు వేశాడు. ఇంకా ముడివెయ్యవలసిన మురికిగుడ్డ కొంతవుంది. ఇప్పుడిక పల్కరించినా పలుకడనుకున్నాడు. మాట్లాడాలనుకుంటే మురికిగుడ్డ పూర్తయ్యేంతవరకూ వేచి వుండాల్సిందే. ఇక లాభం లేదనుకొని గళ్ళలుంగీ వ్యక్తి బయటికి వెళ్ళి ఒక కాఫీహోటల్ నుండి అన్నం, సాంబారు తప్పేలాతో తీసికొని, తిరిగి వచ్చాడు. వస్తూవస్తూ కాగడాలా వెలిగే ఒక కిరసనాయిలుబుడ్డి తీసికొచ్చాడు.

అతను ఆ సత్రం పంచపాళీ మెట్లెక్కగనే వీరాస్వామి కళ్లుమూసుకొన్నాడు. దానికి అసలు కారణం వీరాస్వామి వెలుగుచూడలేక పోవటమే. సూర్యుణ్ణి చూసి ఇప్పటి కతను, రెండుదశాబ్దులు గడిచి, మూడో దశాబ్ది జరుగుతోంది. అప్పటినుంచి చీకటికొట్లులో మ్రగ్గిపోయ్యాడు. చీకటిలోనే సగంజీవితం వెళ్ళబుచ్చాడు. మళ్ళీ వెలుగు చూస్తానని ఆశించలేదతను.

# గృహోన్ముఖుడు

మూడువారాల క్రితం కారాగారంనుంచి అయిష్టంగా విముక్తుడయ్యాడు. చీకటిని ప్రేమించే తనను బలవంతంగా వెలుగులోకి త్రోశారు. వెలుగుచూస్తే అతని కళ్లు కుంచించుకుపోయి చిరాకుపడి కోపగించుకుంటాడు. జైలునుండి 'నంబరు 29'గా కాక వీరాస్వామిగా బయటకొచ్చినప్పటినుంచి, పగలు వంతెనల క్రింద, పాడుపడిన కొంపల, పందికొక్కు గోతుల్లో గడిపేవాడు. రాత్రిళ్ళు చీకటిసందుల్లోకి వెళ్ళి అడుక్కుతినేవాడు. అదీ ఒక్కొక్కరోజు వెళ్ళేవాడు కాదు. చింకిగుడ్డపీలిక ముళ్లువెయ్యటం మొదలుపెట్టాడంటే అతనికే విషయమూ స్ఫురించదు.

ఇప్పుడా కిరసనాయిలుబుడ్డి వెలుగువలన రెండు నిముషాలసేపు కళ్ళుమూసికొని, తరువాత కొద్దిగా తెరచి చీకరిస్తూ, చూస్తూ, "తీసిపారెయ్యి అది" అన్నాడు. గళ్లలుంగీ మనిషి వెంటనే దీపం ఆర్పకుండ అది మెట్ల చాటున పెట్టాడు కొద్దిగా వెలుగుప్రసరించేలా. ఈదీపం వీరాస్వామి ఏకాగ్రతకు భంగం కల్గించింది. తపేలాముందు పెట్టగానే 'గడగడ' ఖాళీచేసిపారేశాడు వీరాస్వామి.

"నేను గ్నాపకం వున్నానా? నేను సింహాద్రిని, ...యాభై రెండోగదిలో వుండేవాడ్ని" అన్నాడా గళ్ళలుంగీ.

ఈమాటలు పూర్తిగా వినిపించుకున్నాడు గాని అన్నిమాటలూ పూర్తిగా అర్థంకాలేదు. అర్థంచేసుకుంటానికి ఉత్సుకతనుకూడ ప్రదర్శించలేదు, ఓ చిరునవ్వు విసిరాడు. సింహాద్రి తరువాత ఆగదిలో ఇద్దరు ముగ్గురు మారిపొయ్యారు. వాళ్ళందర్నీ గుర్తుంచుకోనవలసిన అవసరమేముంది అతనికి. "సింహాద్రివా? అన్నాడు నిర్లక్ష్యంగా."

జైలుమిత్రుడు తనను గుర్తించకల్గినందుకు సింహాద్రికి ఒకపళ్ళు కొట్టేసినంత సంతోషం కల్గింది. దానితో పరవశం చెందిపొయ్యాడు. యజమానిని చూసి కుక్క తోకాడించినట్లు సింహాద్రి ఈ ఆనందోద్రేకంలో ఊహాసౌధాలు కట్టటం మొదలుపెట్టాడు. రేపటినుండి తన కార్యకలాపాలలో వీరాస్వామి కుడిభుజంగా ఉంటాడు. డబ్బు అపహరించి పారిపోతూంటే, ఎవరైనా పట్టుకుంటే, వీరాస్వామి నల్గురిని తన్నగలడు. ఓహ్... రెండుచేతులా డబ్బు సంపాదించవచ్చునని చిరునవ్వు లాస్యంచేసే ముఖంతో మిత్రునికేసి తిరిగాడు. కెవ్వున కేక వేద్దామనుకున్నాడు.

వీరాస్వామి,మురికిగుడ్డ పీలికలతో వేసినముళ్లన్నీ విప్పుతున్నాడు, ఒక్కొక్కటే. ఇప్పుడిహ పల్కరించటానికి వీల్లేదు.

జైలులోవుండగా అస్తమానం గోడకేసి చూస్తూ కూర్చోలేక ఈపనికి తలపడ్డాడు. అత్యంత కార్యదీక్షతో, ఉత్సాహంతో ఓపికతో ముళ్ళువేసి విప్పుతూంటే, అనోకలోకంలో సంచరించేవాడు, వాస్తవిక ప్రపంచాన్ని విస్మరించి. గతజీవితపు స్మృతులు, జైలు అధికారులు అధికారగర్వంతో చేసే అఘాయిత్యాలు ఏవీ దగ్గరకు చేరేవికావు. ఆపని కల్పించుకోనకపోతే ఈనాటికి పిచ్చిఆసుపత్రిలో వుంచేవారేమో. అయినా ఇప్పుడితను సాధరణవ్యక్తి అని ఏ "సైకాలజిస్టు" నిరూపించలేడు.

సింహాద్రి ఆశలు వమ్మయిపొయ్యాయి ఇక వీరాస్వామితో వ్యవహారం చంకలో పిల్లి బాపతుగా మారుతుందని భావించాడు. అయితే వీరాస్వామిని భవిష్యత్తు ఏమిటి? ఎవరు పోషిస్తారు? అని ప్రశ్నించుకోసాగాడు.

ఆ జేబు ఆ జేబుసర్ది వీరాస్వామిని తను పోషించగలడు. కాని ఆశ్రయం ఎక్కడ? ఈసత్రంలోమాత్రం కుదరదు. గాలికి వెలుతురుకు అలవాటుపడేవరకూ ఒక చీకటికొట్టు చూడాలి. అది ఎలా సాధ్యమౌతుంది. ప్రపంచమే తన ఇల్లుగా భావించిన విశ్వమానవశ్రేయోభిలాషి సింహాద్రికి స్వంత ఇల్లు అవసరం లేనప్పుడు వీరాస్వామికి చీకటికొట్టు చూడటం, దుర్లభం. అంతలో మరొక సందేహంకల్గింది. వీరాస్వామిని తను ఎన్నాళ్లు పోషించగలడు? ఆప్తబంధువులూ, మిత్రులైన 'కాకి' వస్త్రధారులు తనను మర్యాదగా తీసికెళ్ళి స్వగృహంలో దిగబెట్టేవరకు.

సత్యం చెప్పాలంటే, వీరాస్వామికి, (అతని పరివారానికి) పుట్టిల్లు ఆజిల్లా కోర్టు వెనకవుంది. జీవితంలో ఎక్కువభాగం అక్కడే హాయిగా కాలం గడుపుతారు. విద్యార్థులు శెలవులకు ఇళ్ళకు వెళ్ళినట్లు అప్పుడప్పుడు బయట విహరిస్తూంటారు. ఇప్పుడు సింహాద్రిని పీడిస్తున్నది ఒకటే బాధ. పుణ్యంపండిపోయి తనా పుట్టింటికి చేరితే, వీరాస్వామి తనను ఎలా కలుసుకోగలడు. అతను కూడ దొంగతనంచేస్తే, మాట్లాడకుండ, జన్మభూమిలో దిగబెడతారు. అయితే ఇప్పుడు వీరాస్వామికి, ఈపరిస్థితులలో ఆలోచనలే తట్టవు. అని సంబాళించుకున్నాడు.

వీరాస్వామిలో అన్ని మానవప్రవృత్తులు చచ్చిపోయినాయి. ఇంకా అప్పుడప్పుడు పొగరాచుకొంటున్నట్టు బయటికొస్తుంది పాశవప్రవృత్తి. "ఎప్పుడైనా

కోపం వస్తే ఎవర్నయినా చంపుతాడు, దానితో ఆఖరు, ఉరిశిక్షపడుతుంది" అనుకున్నాడు.

ఆలోచిస్తూ సింహాద్రి ప్రక్కకు తిరిగాడు. దీపపుకాంతిలో తననీడ ఆగోడపై బడుతోంది. ఆనీడకంఠం ఎకిలిగా పల్కరించింది సింహాద్రిని.

"అయితే ఇప్పుడు వీరాస్వామి జీవించి వున్నాడా?" అని ప్రశ్నించింది.

"బ్రతికేవున్నా డనుకొంటాను" అన్నాడు సింహాద్రి.

"పొరబడుతున్నావ్! వీరాస్వామి మరణించి, నంబరు 29 గా రెండో జన్మ ఎత్తాడు. నంబరు ఇరవైతొమ్మిదనే పేరుతో ఇరవైఅయిదు సంవత్సరాలు ఆ జిల్లాకోర్టు వెనుక స్వగృహంలో జీవించాడు. ఇద్దరు బంట్రోతులు రారాజుసింహద్వారంవద్ద పహరాకాసినట్టు గస్తీతిరుగుతూండేవారు. ఇప్పుడు చట్టంప్రకారం బజార్లో వదిలేశారు. పాతికఏళ్లు గానుగ లాగించి గొడ్డుచాకిరీ చేయించారు. దృఢమైన అతనిశరీరం,ఇనుప దూలాలెత్తి ఆభవననిర్మాణంలో సడలిపోయింది. వార్ధక్యం గోచరిస్తూ ఇంకా మానవుడని అనబడుతున్న ఆజీవి, నడిబజారులో దిక్కులేనిచావు పొందవలసిన అవసరమేమీ లేదు" అంది.

"అయితే ఇప్పుడతనిని ఎవరు పోషిస్తారు?" సింహాద్రి సందేహం.

"పాతికసంవత్సరాలు చాకిరీ ఎవ్వరు చేయించుకున్నారో, వాళ్ళదే ఆపోషించాల్సిన బాధ్యత. అంతే కానీ నీకెందుకీ బాధ? నివ్వేమన్నా అతనికి ఋణపడ్డావా?" తిరిగి ప్రశ్నించిందా కంఠం.

"బాగనేవుంది కానీ......" అని ఏదోగొణగబోయ్యాడు సింహాద్రి. "కానీ లేదూ గీనీ కాదు. అక్కడికే పంపించెయ్యి. అనలాభవనం మీదేగా!" అని ఆకంఠం.అదృశ్యమైపోయింది. ఇటు దీపంఆరిపోయింది.

"రేపు తెల్లవారేప్పటికి, అక్కడకు పంపించకపోతే నాపేరు సింహాద్రి కాద"ని బిగ్గరగా అరిచాడు. ఆ అరుపుతో గుడ్డపీలిక ముళ్ళువేస్తూన్న వీరాస్వామి ఇటు తిరిగిచూశాడు. సింహాద్రి గోడవేపుకు తిరిగి మాట్లాడుకోవటంచూసి మళ్ళీ తనపనిలో తను నిమగ్నుడయ్యాడు.

వెంటనే అరుగు దూకి సింహాద్రి రోడ్డుపై బడ్డాడు. అర్ధరాత్రివేళ, గభాలున అరుగుదూకటం చూసి గస్తీతిరుగుతూన్న పోలీసు వడివడిగా పరుగెత్తుకొచ్చాడు.

"సత్రంలో ఏముందని దొంగలుపడ్డారనుకున్నా" అని సింహాద్రి పకపకానవ్వి "దొంగలభయం ఈ సత్రంలో ఎవ్వడికీ లేదు. వాళ్ళకున్న ధనమల్లా మీ పోలీసోళ్లను చూశే." అంటూ లుంగీక్రిందకు దించాడు.

"ఓరీ నువ్వట్రా సింహాద్రీ......దొంగ అనుకున్నారా" అన్నాడు పోలీసు సింహాద్రిని సజ్జనుడుగా వ్యవహరించి.

"నీవు దొంగల్ని పట్టాలంటె...అదిగో ఆ మేడల కల్లిపో...ఆ మేడల్లో నిద్రించేవారికి మీరు అవసరం" అన్నాడు.

"ఏరేకానీ ఈనెల మామూలేదిరా?" పోలీసు హెచ్చరించాడు.

"మొన్న కోడిపుంజు, ఎన్నపూస పంపా కదండీ"

"అయితే దానికీ దీనికీ చెల్లట్రా...గాడిదా... రేపు ఇవ్వకపోతె బొక్కలో తోస్తా" అధికారదర్పంతో హెచ్చరించాడు.

"తమాషా కన్నాలెండి...రేపు తప్పక చూస్తాగా...ఇప్పుడదే పనిమీద పోతున్నా" అని ముసిముసినవ్వులు నవ్వుకొంటూ ముందుకు నడిచాడు.

పోయి, "గుంటగ్రౌండ్స" ప్రక్కనున్న ఒక చిన్నటీస్టాల్ వద్ద ఆగాడు. ఆ హోటలుముందు పందిరిలో వ్రేలాడతీసిన గ్యాసులైటు వెలుతురులో నిల్చున్నది మధ్యవయస్కురాలులా కన్పిస్తున్న ఒకయువతి. నలిగిపోయిన చౌకబారు సిల్కుచీర ధరించింది. జడలో వాడిపోయిన మల్లెపూలున్నాయి. సింహాద్రిని చూసి బలవంతంగా చిరునవ్వునవ్వింది. సింహాద్రి పాకలోకి దూసుకుపోతూ "రావేటి తాగుదాం రా...ఏం?...ఈ రోజు బేరం గిట్టుబాటుగా లేదా? సరిగా లేవే!" అన్నాడు.

"ఓరి సచ్చినోడా నోరుమూసుకోరా" అనుకుంటూ లోపలికొచ్చింది. ఇద్దరూకలిసి టీత్రాగి మళ్ళీ సత్రంవద్దకెళ్లి వీరాస్వామిని తీసుకొని'గుంటగ్రౌండ్స' ప్రక్కగా వెళ్తూన్న రోడ్డుపై నడచి రెండువంతెనల క్రిందగా పోయ్యారు.

* * * *

వీరాస్వామిపుట్టుకతోనే తండ్రిని కోల్పోయిన దురదృష్టవంతుడు. ఊళ్ళోవాళ్ళంతా జన్మతః దరిద్రడనిపిలిచేవాళ్లు. కొందరు "పాపిష్టిముఖం"అని ముద్దుగా పిలిచేవాళ్ళు. కొందరు "వీరామ్" అని పిలిచేవాళ్ళు, వాళ్ళ తోత్తులాగ.

వీరాస్వామికి గతించినతండ్రి మిగిల్చిపోయింది, రెండెకరాలగరువు, వంశపారంపర్యంగా వస్తూన్న కొలిమితిత్తి, సమ్మెటలు, ఓచిన్న ఇల్లు. తండ్రిమీద

గౌరవం కొద్దీ అతని మిత్రుడొకడు వీరాస్వామిని చేరదీసి కులవృత్తి నేర్పించాడు.

వీరాస్వామి కష్టజీవి. ప్రొద్దున్నే లేచి, కొలిమి ముట్టించి తిత్తికొట్టేవాడు. ఇనుపముక్కలను ఎఱ్ఱగా కాల్చి సమ్మెటతో సాగగొట్టేవాడు. సమ్మెటతో ఏకధాటిగా పోటు వేస్తూంటే ఇనుపకమ్మీనుండి ఎఱ్ఱటి నిప్పుకణాలు అతనిమీదుగా దూసుకుపొయ్యేవి. రాత్రింబవళ్ళు సమ్మెటతో అతడు జరిపే ఆ పోరాటం వలన అతని రెక్కలు పెడతిరిగిపొయ్యాయి. ఆ ఊళ్ళో బండిపట్టాలు మొదలుకొని, దేవుళ్ళ విగ్రహాల వరకూ అతని సమ్మెటపోటు తినని వస్తువులేదు.

ఈకష్టానికి, వీరాస్వామికి డబ్బురూపేణా పెద్దగా ముట్టేది కాదు. సగానికిపైగా, ఊళ్లో, సంవత్సరానికి ఇన్నిబస్తాల సజ్జలు, ఇన్నిబస్తాల జొన్నలని కంట్రాక్టుపద్ధతి ఉండేది. పనిముగిసిన తరువాత 'ఇవాళ రేప'ని సంగనామాలు పెట్టేవాళ్ళపట్ల అతను ఉదాసీనంగా ప్రవర్తించేవాడు. మొత్తానికి ఊళ్ళో వీరాస్వామి అమాయకుడు, సెమ్మదికలవాడనిపించుకున్నాడు.

ఆ ఊళ్లోకల్లా మోతుబరీరైతు నారాయణరావు. వీరాస్వామి రెండెకరాలగరువు ఆయనే సాగుచేసి ధాన్యం ఇంటికితోలేవాడు. ప్రతిచిన్న విషయానికి వీరాస్వామికి కబురుపెట్టేవాడు. ఇదివరకు ఇల్లుసరిగా గడవనిరోజుల్లో పది పరక సర్దుకునేవాడు. అందువలన నారాయణరావంటే అకుంఠితమైన గురి ఏర్పడింది. ఆ విశ్వాసం కొద్దీ వీరాస్వామి, కొలిమిమీద మిగిలేడబ్బు నారాయణరావుదగ్గర దాస్తుండేవాడు.

మాటల్లో డబ్బుప్రస్తావనవచ్చి ఒకరోజు, వీరాస్వామితల్లి ప్రశ్నించింది. "ఏరా? ఆయనదగ్గర సొమ్మెంతయిందిరా?" అని.

"నేను లెక్కెట్టుకోటం లేదే—అమ్మా......నా పెళ్ళికి మనడబ్బుకాక రెండుమూడువందలు అదనంగా ముట్టచెపుతానన్నాడే...అని ఒక్కక్షణం ఆగి...ఆయన చాలా గొప్పమనిషే..."అన్నాడు.

"అంతేలే ఆయన దయ, మనప్రాప్తం" అన్నది ముసలమ్మ.

ఆ రెండోసంవత్సరం పెద్దలు వీరాస్వామికి వివాహమహోత్సవం నిర్ణయించారు. పెళ్లికి దాచుకున్న డబ్బు తాలూకు వీరాస్వామికి పధ్నాల్గు వందలరూపాయిలు (1400) నారాయణరావు ముట్టచెప్పాడు. ఎనిమిదిసంవత్సరాలనుండి, యేటా మూడువందల చొప్పున దాచినడబ్బంతా ఇదేనా అని అతనిముఖం వివర్ణతచెందింది. మనస్సు చివుక్కుమన్నది. అంతలోనే అంతరాత్మప్రబోధించింది 'నారాయణరావ్ ఆలాంటివ్యక్తి కాదు. అతని ఉదారస్వభావం శంకించడం ఎంతపొరపాటు' అని. వివాహం తన తాహతుకు బాగానే జరిగిందని సంతృప్తిచెందాడు వీరాస్వామి. పెళ్లికి నారాయణరావు వధూవరులకు బట్టలు పెట్టి వెండిసామాను చదివించారు. దానికి వీరాస్వామి ఆనందోద్రిక్తుడై లోలోన నారాయణరావుగార్ని తన మనోనేత్రమ్ముందు పూజించాడు. అంతటి విశాల హృదయాన్ని శంకించటం పాపమని బాధపడ్డాడు.

వివాహానంతరం, వీరాస్వామి ఖర్చులోపడ్డాడు. చుట్టాలతాకిడి ఎక్కువైంది. అత్తగారింటికి స్వగ్రామానికి తిరగటంతో పని మూలబడి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. ఆ పరిస్థితులలో నారాయణరావుగారివద్ద రెండువందలు చేబదులు తీసికొని, పని ప్రారంభించి, రెండునెలలు గిరున తిరిగేసరికి చెల్లు కట్టివేశాడు.

ఇంతలో మరోవిఘాతం తగిలింది. అతనిజీవితంలో దుర్దశప్రారంభమైంది. పెళ్ళయి రెండుసంవత్సరాలైన గడవకముందే, వీరాస్వామికి జీవితసమస్యలు అనేకం ఎదురొచ్చాయి. నారాయణరావు పొలం చెయ్యటంలేదు. తీరుబడిలేక ఒప్పుకున్నరోజుకి పనిముట్లు చేసి యివ్వలేకపోతున్నాడు. చేతిలో చిల్లిగవ్వలేదు. పైన బంధువుల రాకపోకలు. ఏరోజుకారోజు కొలిమిమీద పొట్టగడవటమైంది. మానసికంగా వ్యధచెందాడు. వీటన్నిటిని మించిన మరోసంఘటన అతనిని క్రుంగదీయటం మొదలెట్టింది.

తల్లి మంచానపడింది. తెల్లగా పాలిపోయింది. కళ్ళుగుంటలు పడిపోయి తెల్లవార్లూ కన్నుమూయకుండ దగ్గుతోంది. రాత్రికి రెండుసార్లయినా, తల్లి ఉమ్మివేసిన పెంకు శుభ్రంచెయ్యవలసివచ్చింది. తల్లి ఆరోగ్యాన్నిగూర్చి తెలిసికొని పోనామనివచ్చిన మామగారు "అక్కడ మీ అత్తకూడ లేవటంలేదని" చాకుచెప్పి కూతుర్ని వెంటపెట్టుకొని వెళ్లిపొయ్యాడు.

ఇప్పుడు తల్లికి అన్ని ఉపచారాలు తనొక్కడే చెయ్యవలసివచ్చింది. కొలిమిపని పూర్తిగా మూలబడింది. ఉదయంనుండి సాయంత్రంవరకూ నాటువైద్యుడు చెప్పినట్లు భస్మాలు నూరటం, మందులు కలపటంతో క్షణం తీరికలేకుండపోయింది. పరిస్థితి మరీ కటువుగా ఉంటే మందులకూ వాటికి నారాయణరావుగారివద్ద మూడువందలరూపాయిలు తీసుకున్నాడు. అంత ఖర్చయినా రోగమాత్రం తేరుకోలేదు. పైగా ఇప్పుడన్నీ మంచంలోనే.

ముసలమ్మ రోజురోజుకూ క్షీణించిపోసాగింది. రక్తవిహీనమై ఎముకల గూడులా తయారైంది. ఒక్కో

క్కరోజు ముసలమ్మ దగ్గి దగ్గి శోషవచ్చి పడిపొయ్యేది. ఆదగ్గులో వీరాస్వామి రక్తపుజీర చూసి కంపితుడయ్యాడు. ఆ హృదయవిదారకదృశ్యంతో కళ్ళనీళ్లు ఒత్తుకుని. ఊడ్చిపారబోస్తూన్న వీరాస్వామిని వైద్యుడు చాటుకు "పిలచి ఇది అంటురోగం, క్షయ, అరుకు బెరుకూ లేకుండ సేవ చెయ్యటం, అంతకుమించిది కాదు" అన్నాడు.

వీరాస్వామి అప్రతిభుడై మాటాడుతున్న ఆ వ్యక్తికేసి నిశ్చలంగాచూసి, మరుక్షణంలో అతని కాళ్ళపై బడ్డాడు.

"బాబ్బాబు...మీ మేలెన్నటికీ మరువను. ఎన్ని వందలైనా ఇచ్చుకుంటాను. రోగం నయంచెయ్యండి" అని బ్రతిమాలాడు.

"వీరయ్యా నేను చెయ్యాల్సిందంతా చేశాను. ఇప్పుడు మనశక్తికి దాటిపోయింది. ఇంకా నీకు ఆశ వుంటే పట్నంనుండి ఇంగ్లీషు డాక్టరును పిలిపించు. లేకపోతే మనం రోగిని మంచంపై వేసుకొని పట్టణానికి పోవాలి" అన్నాడు.

మంచంపైన వేసుకొని తీసికెళ్ళి ధర్మాసుపత్రిలో జేర్చాలనుకున్నాడు. జోరున వర్షం కురుస్తున్నది. మోకాళ్ళలోతు బురద. మంచంపట్టటానికి రెండోమనిషైనా కావాలి. ఈవానలో రోగిష్టి మంచం మొయ్యటాని కెవరు ఉపక్రమిస్తారు......ఆలోచనాభారంతో క్రుంగిపోతూ ఊళ్ళోకెళ్ళాడు.

"ఈవర్షంలో రోగిని ఎలా తీసుకెళ్తావ్?...చినుకు పడితే మనిషి చేతికి చిక్కుతుందిరా?" అన్నాడు తోటికులస్థుడు. ఈప్రయత్నం విఫలంకావటంతో వీరాస్వామి డాక్టరును తీసుకురావటానికి నిశ్చయించుకున్నాడు.

దగ్గటానికికూడ ఓపికనశించి కళ్ళు మూతలుపడిపోయి యమయాతనపడుతున్న తల్లికేసి ఓమారుచూసి, విసవిస నారాయణరావు ఇంటికేసి నడిచాడు.

యాభైరూపాయి లిస్తూ నారాయణరావుగారు "ఈ తెల్ల కాగితంపై సంతకంచేసిపోరా" అన్నాడు.

"ప్రానోటా దొరా....మంచిదేలెండి....అసలు నేనే వ్రాద్దామనుకున్నాను" అన్నాడు.

"ప్రానోటు కాదురేరా?...ఎన్ని బాకీలు...గుర్తుకోసం ఈసంతకం చేయించుతున్నానులే" అన్నాడు. రావుగారు.

సంతకంచేసి వీరాస్వామి మోకాళ్ల లోతు బురదలో నడిచి పట్నంపోయి, ఇద్దరు ముగ్గురుడాక్టర్లను విచారించాడు. ఒకడాక్టరు 'టాక్సీ' పిలిపిస్తేవస్తానన్నాడు: టాక్సీవాడు, రోడ్డులేని గ్రామం, వర్షం కాబట్టి రానుపోను యాభైరూపాయి లిమ్మన్నాడు. అందుకంగీకరించాడుకాని, డబ్బుచేతిలో వెయ్యనిదే డాక్టరు బయలుదేరడని సంకోచించి డబ్బుకోసం తిరిగి గ్రామానికి ప్రయాణమయ్యాడు.

ఊళ్ళో అడుగుపెట్టి సరాసరి నారాయణరావుగారింటికి వెళ్లాడు. నారాయణరావుగారు చుట్టకాలుస్తూ మడతకుర్చీలో పడుకొని ముచ్చటిస్తున్నాడు. వీరాస్వామిని చూడగనే...

"ఏమిట్రా? ఇంకా డబ్బు కావాలా?" ప్రశ్నించాడు...తలఊగించి "అవునుదొరా...ఈసారి పెద్ద మొత్తం కావాలండీ...పొలం తాకట్టుపెట్టుకొని..." అంటూవుండగనే నారాయణరావుగారందుకొని "ఛీ ఛీ అవేమాటల్రా! ఈపాటిదానికేనా?" అన్నాడు. ఆపైన కొద్దిసంభాషణ జరిగింది. దానిని పురస్కరించుకొని నారాయణరావుగారన్నాలు "సరే నీ ఇష్టమొచ్చినట్లే కానియ్యి. ఇప్పుడెంతకావాలి నీకు?" "మూడు వందలండీ" "అంత లేదులే. రెండువందలున్నాయ్ తీసుకో!" అని వీరాస్వామి చేతిలోపెట్టి "దీనితో సరిపోయింది" అన్నాడు.

సరిపోవట మేమిటనుకున్నాడు వీరయ్య. కాని ఆలోచనకు వ్యవధిలేదు. మరణశయ్యపైనున్న తల్లి విషాదదృశ్యం పదేపదే గోచరిస్తోంది. తల్లి దగ్గుతూన్న దృశ్యం మనస్సులో కలుక్కుమంటూంటే గడియలుగడవటం దుర్భరంకాసాగింది. ఓ మారు తల్లిని చూసిపోదామని ఇల్లు చేరాడు.

"ఇల్లంతా చీకటిగా ఉంది. మృత్యుప్రశాంతత ఆవరించింది. పగలంతా వర్షంకురవటంచేత త్వరగా చీకటిపడింది. మనిషివచ్చిన అలికిడివిని కొలిమిపొయ్యిలో పడుకున్న కుక్క అతనికేసిచూసింది. వీరాస్వామి 'ఆవూళ్లోవున్నదిక్కంతంతేనా' అనిబావురుమన్నాడు. ఆతురతతో దీపంవెలిగించి, మంచంపైనున్న తల్లిని చూశాడు. కళ్ళు చెదరిపోయినాయి.

పక్కగుడ్డలన్నీ రక్తవర్ణములైపోయినాయి. నెత్తురు కుదపలలో తలవాల్చుకొని, మూర్ఛితయై వున్నట్లు కన్పించుతున్న తల్లికన్నులు శాశ్వతంగా మూసుకున్నాయి. క్షయవ్యాధి పీడితురాలై రక్తవమనంచేసికొని పాలిపోయి పసుపు పచ్చగావున్న తల్లి అరచేతిని స్పృశించాడు. చల్లగావుంది. శరీరమంతా తడిమిచూశాడు. బిగుసుకుపోతూన్న శవాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు. భౌతికదేహపు తార్కాణానికి చిహ్నంగా మిగిలిందా శవం. తల్లిపైబడి భోరున ఏడ్చాడు.

# గృహోన్ముఖుడు

రెండవరోజు శవానికి దహనసంస్కారాలు జరిగాయి. పదిహేనురోజులకు పెద్దదినం పెట్టారు. పరలోకవాసుల పేరిట ఇహలోకమహాశయులు సుష్టుగా భోంచేశారు, ఆ స్మారకదినంరోజు. అందరూ పరామర్శించారు. వీరాస్వామిని అందరితోపాటుగా నారాయణరావుకూడ రెండు అనునయవాక్యాలుపలికి,

"ఏమిరా వీరయ్యా? మరి బాకీసంగతేం జేశావురా?" అన్నాడు పదునుగా వినేలా... "తీరుస్తాను దొరా...ఒక సంవత్సరం ఓపికపట్టండి. వడ్డీతో సహా తీర్చుకుంటాను" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"సంవత్సరం ఆగితే ఎలా? ఇప్పటికే రెండు వేలు చిల్లరయి మూడు కావస్తోంటే" వీరాస్వామి స్తంభించిపొయ్యాడు. భృకుటి కుంచిస్తూ వినమ్రుడై తగ్గుస్థాయిలో పలికాడు. "సరిగా చూడండి దొరా! నేను తీసుకున్న బాకీ వడ్డీతోసహా వెయ్యిరూపాయిలు కాదు." అన్నాడు.

"అయితే నేను అబద్ధమాడుతున్నానంటావా?" అన్నాడు కృత్రిమమైన చిరునవ్వుతో. అనూహ్యమైన ఈ సన్నివేశం, సంభాషణలు విభ్రాంతి చెందించాయి. వీరయ్య కొద్దిగా ఉద్రేకపడ్డాడు. పొంగివస్తూన్న ఉద్వేగాన్ని అణచుకుంటూ,

"సరిగా చూడండిదొరలు.......మరిసిపొయ్యుంటారు" అన్నాడు దీనంగా, వ్యవహారసఖ్యం పురస్కరించుకొని.

"అంతేరా! తీసుకొనేప్పుడుండే బుద్ధి, ఇచ్చేటప్పుడుంటుందా?...వెధవలు...అవసరమైతే కాళ్ళావేళ్ళాపడతారు. అవసరం తీరినతరువాత, ఈకూతలట్రా...ఏ పెద్దమనిషి చెప్తాడో చెప్పమను" అంటూ ఆనోటు పెద్దమనుష్యుల మధ్య విసిరాడు.

ఒక పెద్దమనిషి నోటు పరీక్షించసాగాడు. అతడినుద్దేశించి "పెద్దగా చదవయ్యా...ఇంగుట్లో దాపరికం ఏముంది...కతిక రొఖ్ఖం, ఇరవై అయిదు వందలు" అన్నాడు వేలల్లో చెపితే ఇంపుగావుండదని నారాయణరావు. నారాయణరావుగారిమాట శిరసావహించి, ఆ పెద్దమనిషి బిగ్గరగా చదువనారంభించాడు.

ఆనా ఫలానా సంవత్సరం మొదలుకొని...వినా హానిమిత్తమై తీసుకున్నరొఖ్ఖం (రూ. 1400) పద్నాల్గు వందరూపాయలు, అక్షరాలా అంటూ చదువసాగడు. నోటుచదవటం పూర్తయింది.

"మీరైనా చెప్పండయ్యా..వడ్డీతో సహా మూడు వేలరూపాయిలు కావటం లేదటయ్యా" పెద్దమనుషుల గోష్ఠిని ప్రశ్నించాడు నారాయణరావు.

ఒక పెద్దమనిషి—"ఇన్ని వందలు పుచ్చుకోటాని నీసంపాదనంతా ఏమైపోయిందిరా వీరయ్యా" అని ఓ మాట అర్థోక్తిలోపలికి "అయినా ఇచ్చింది మీరు పుచ్చుకొన్నది వారు...మధ్యలో మేమేమి చెప్పగలం!" అంటూ వెనక పీడన్నట్లు నిష్క్రమించాడు. పెద్దలందరూ జారుకున్నారు.

"మీరు న్యాయం చెప్పకపోతే కోర్టు లేదా? సాక్షులు లేరా? ఈవిషయం అక్కడే తేల్చుకుంటాను" అంటూ నారాయణరావు కొరకొర చూచుకుంటూ వెళ్ళిపొయ్యాడు.

అందరూ వెళ్ళిపొయ్యాక, వీరాస్వామి కాలిపోయిన కొలిమి బూడిదపై చతికిలబడ్డాడు. శూన్యంలోకిచూస్తూ గత జీవితాన్ని ఒకసారి నెమరువేసుకున్నాడు. సమ్మెటపై చెమట ధారబోసిన డబ్బంతా ఆ బూడిదలో ఇంకిపోయినట్లు అనుభూతి కలిగింది. తల్లిదండ్రి అనాలోచితంగా గుర్తొచ్చి కుమిలిపొయ్యాడు. ఆనందంతో సుఖంగా గడుపవలసిన ఈ వయసులో తన ఎన్ని బాధలు అవహించాయో, ఊహించుకోటూండగనే, నిద్రాదేవత ఆవేశించింది. రెండవ రోజు ఉదయం ఊళ్ళోకెళ్ళి పదిమందితో చెప్పుకున్నాడు. చెఱువుగట్టున చింతమానుక్రింద కూర్చొని "డబ్బు దాచినప్పుడు గాని తీసుకున్నప్పుడు గాని మాకు తెలియపర్చావా? ఇప్పుడు నన్ను అన్యాయం చేశాడంటే, లాభం ఏముంది వీరయ్యా...అసలు ఇంత రాద్ధాంతం జరుగుతుందని మొదటనే అనుకున్నాం. ఆపొలం నీకు దక్కుతుందని నమ్మకంలేదు" అన్నారు.

"నారాయణరావు ఆపొలమంతా అన్యాయంగా సంపాదించినదేగా" అన్నాడొక వృద్ధుడు.

"నోటుమీద నీసంతకంవుండగా మనం చేయతగ్గదేదీ లేదు వీరయ్యా!...అనుభవించక తప్పదు...ఆతన్ని నమ్మిమోసపోయింది నీ ఒక్కడవే కాదుగా" అంటూ పొన్నుగఱ్ఱలు చేతబట్టి సమావేశం ముగించారు.

మూడువారాలు తిరిగేలోగా, వీరాస్వామికి "సమన్లు" అందాయి. కోర్టుకు హాజరయ్యాడు. తనతరుపున ప్లీడర్ని పెట్టటానికి చాలినంతడబ్బు లేకపోయింది. న్యాయవాదిముందు, తన నిజాయితీకి, అమాయకతకూ విలువలేకపోయింది. వాస్తవపరిస్థితులు వీరాస్వామి ఏకరువుపెట్టుకోటానికి అవకాశం లేకపోయింది. చట్టంప్రకారం నారాయణరావుకు న్యాయం చేకూరింది. వ్రాతపూర్వకమైన రుజువున్న కారణంచేత వీరాస్వామికున్న రెండెకరాలచెక్కా బాకీక్రింద చెల్లిపోయింది. చాటున అన్యాయం, అక్రమమని వాదించినవారెవ్వరూ, ఇప్పుడు సాక్ష్యంచెప్పలేదు.

నారాయణరావుగారి నిజాయితీ, ఉదారబుద్ధిని గూర్చి ప్రశంసించిన వీరయ్య తనఅభిప్రాయాన్ని మార్చుకున్నాడు. 'నెత్తికెత్తుకొని పూజించే నాకు ద్రోహం తలపెడతాడా? కానీయి...ఇప్పుడు మించుకుపోయిందేముందిలే!' అనుకున్నాడు. పెద్దమనిషి బురఖాతగిలించుకొని విషపునవ్వులు నవ్వుతూ తనను ఎంత మోసగించాడో గ్రహించి, తన కర్తవ్యమేమిటి? ఇలా ఏడుస్తూ కూర్చోవటమేనా? అని ప్రశ్నించుకున్నాడు.

ఏమీ బోధపడలేదు. తన పరిస్థితికి జాలిపడుతున్నవాళ్లు ఒక్కరూ లేరు. ఓదార్చేవాళ్ళు అంతకన్నా శూన్యం. సమాజం, ఎందుకింత ఉదాసీనంగా, నిర్దయతో ప్రవర్తిస్తోందో తెలియక తికమకపడ్డాడు. ఈక్లిష్టపరిస్థితులలో కన్నీరు తుడవటానికి, కట్టుకున్న పెళ్ళాంకూడ చెంతలేదు.

ఈభావన కలగటంతో కులస్థులను ముగ్గుర్ని అత్తవారింటికంపాడు. భార్యరాలేదు. పైగా అత్తవారు పంపిన సందేశం హృదయాంతరాళంలోకి దూసుకుపోయి, అమాయికహృదయాన్ని విషతప్తం చేసింది. "ఇల్లూ వాకిలీ ఊడ్చుకుపోయినా సిగ్గులేదు. అయ్యకు పెళ్లాం కావాలటనా? ముఖానికి.....బంగారంలాంటి నా తల్లిని క్షయరోగంవున్న ఆ సంబంధానికిచ్చి, దానినెత్తిన నిప్పులు పోశాం. నారు నూరైనా, నూరు నారైనా, నాకూతురు నేను బ్రతికివుండగా ఆ కొంపలో అడుగుపెట్టదు"అని ఆ పెద్దమనుషులతో అన్నది.

ఈమాటలు, వీరయ్య చెవుల్లో ప్రతిక్షణం సమ్మెటపోటులా, గింగురు మనసాగాయి. హృదయంలో భీషణమైన అగ్నిజ్వాలలు రేగి పొగలు కక్కుతున్నాయి. నారాయణరావు చర్యతో హతాశుడై జీవితంలో విసుగెత్తినవీరయ్యకు ఈ మాటలు గొడ్డలిపెటులా తగిలాయి. తొలిసారిగా మీసంపై చెయ్యివేసికొని, ఇల్లు ప్రతిధ్వనించేలా వికటాట్టహాసం చేశాడు. సమ్మెటచేతబట్టి ఖాళీగానున్న కొలిమి దిమ్మెపై రెండుపోట్లు చరిచాడు. పళ్ళు పటపటా కొరికాడు.

సమాజం ఒక్కొకవ్యక్తిని నిర్వచించేప్పుడు, హంతకుడు, చోరుడు, వ్యభిచారి అని నిర్ణయిస్తుంది. వాస్తవానికి జన్మతః హంతకుడుగా, చోరుడుగా ఎవ్వడూ పుట్టడు. అందరిలోనూ నీచత్వం, క్రౌర్యం, ప్రతీకారభావం, ఈర్ష్య. దొంగబుద్ధి మొదలైనప్రవృత్తులు సహజంగా వుంటూంటాయి. అవకాశమున్నప్పుడు అవశ్యకత కల్గినప్పుడు, నిగ్రహంనశించినప్పుడూ వాటికవే బహిర్గతమౌతూంటాయి. బహిర్గతమైన తరువాత, ఆ ప్రవృత్తికి ప్రతిమానవుడూ సిగ్గుపడతాడు, పశ్చాత్తాపపడతాడు—సంస్కరించుకోవాలనుకుంటాడు కాని వాళ్ళకు చేయూతనిచ్చి సమాజం పునరుద్ధరించటానికి సంకల్పించనప్పుడు, ఆ మార్గంనుండి వెనుదిరుగటానికి వీల్లేనప్పుడూ జీవితాంతం, ఆ వ్యక్తి ఆ మార్గంలోనే, సంచరిస్తాడు.

ఇప్పుడు వీరాస్వామిలో అదే భావసంఘర్షణ జరుగుతోంది. నారాయణరావు చేసినద్రోహం, అత్తగారు ఆపాదించిన అవమానం, తీవ్రంగాపనిచేశాయి. ఆ అమాయికహృదయంలో అణగారి నిద్రిస్తూన్న ప్రతీకారభావం క్రోధంమొదలైన పాశవికప్రవృత్తులను ఎవరోతట్టిలేపి ఉసికొల్పినట్లయింది. ఆ ఉద్రేకంతోనే సమ్మెటతీసికొని, నరాలలో క్రోధభావం పొంగిపోతూంటే, రెండుదెబ్బలు వేశాడు. ఆ తాత్కాలిక ఉద్రేకాన్ని ఆ రూపేణా ఉపశమింపచేసుకొన్నాడు.

క్షీరసాగరంలో హాలాహల ముద్భవించింది. ప్రతీకారకాంక్ష, కక్ష అతనిహృదయంలో పడగలెత్తి బుసలుకొట్టాయి. సమ్మెట క్రిందికిదించి, అనాలోచితంగా పనికెళ్ళాడు.

తల్లి మంచం కన్పించింది. ఆమె ధరించిన పాత చీరెలు, కఱ్ఱపై వ్రేలాడుతున్నాయి. తండ్రితనకై మిగిల్చిపోయిన కమ్మరిసామాను మూలనపడి జాలిగా చూశాయి. స్మృతిపథంలో తల్లిదండ్రులు కన్పించి, పక్కపై వాలి కుమిలిపోయ్యాడు. 'దిక్కులేనోడ్ని-దరిద్రుణ్ని' అని లోలోన వ్యధచెంది, చెమ్మగిల్లిన కనురెప్పలు తెరిచాడు. ఇల్లంతా బోసికొట్టి, బావురుమంటూ భీతావహంగా ఉంది. మాతృ పితృ భార్యావియోగం, అతడింతకుపూర్వ మనుభవించిన నిరాశను ద్విగుణీకృతంచేసింది. ఆ నిరాశలోనే ప్రతికక్ష అంధకారంలో కత్తి మెఱుపులా "కత్తిగంటుమీద నెత్తురుబొట్టు"లా ప్రకాశించింది.

ఆందోళనోద్రిక్తుడై నలుమూలలా చూడసాగాడు. బుడ్డిదీపంపొగ రాజుకొని మసిగొట్టుకున్న ఆ చూరుకేసిచూశాడు. తండ్రి ఉపయోగించిన పరికరాలు తుప్పుబట్టి వ్రేలాడుతున్నాయి. కొడవలితో ఆ మూటను ఒక్క దెబ్బతో క్రిందకు పడగొట్టాడు. ఇనపశాణాలు, మడ్డుకత్తులు, సుత్తెలు, గొడ్డళ్ళు పిచ్చిపిచ్చివన్నీ ఉన్నాయి. వాటప్రయోజకత్వం ఈపూట విస్తృతంగా బోధపడసాగింది. ఒక మడ్డుకత్తిని, ఒక గండ్రగొడ్డలిని అప్యాయంగా దగ్గరకు తీసికొని భయంకరంగా నవ్వాడు. మెల్లగా కొలిమివైపు నడిచాడు. కొలిమిపొయ్యిలో ముడుచుకొని నిద్రిస్తూన్న కుక్క

ఒళ్ళు దులుపుకొని, చెవులుముడిచి తోకాడించుకొంటూ దగ్గరచేరింది. చేతుల్లో సామాన్లు జారవిడిచి కుక్కను కౌగలించుకొన్నాడు. "అందరూగా సొమ్ము తిని నా రొమ్ము గుద్దినోళ్ళే...నీ వొక్కడివే మంచోడివిరా" అంటూ రెండుకన్నీటిబొట్లు దానిపైరాల్చాడు. ఆపైన, కుక్కనుతీసికొని, ఎలుకలపాలెం కేసి నడిచాడు.

దివాకరుడు రక్తవర్ణం పూసికొనివస్తున్న నిశాకాంతనుభయపడి, ప్రకృతిమాత ఒడిలో చొరబడ్డాడు. మసక చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. ఎలుకలపాలెంలో నున్న ఈతచెట్లు జడలు విరబోసికొని వికృతంగా నిల్చున్నాయి.

ఆ గుడిసెల్లోనుండి వీరయ్య బయటపడ్డాడు. కళ్లు చింతనిప్పుల్లా ఎఱ్ఱగా మండుకొంటున్నాయి. తూలుకుంటూపోయి వీధిలోపడ్డాడు. మనిషికి అడుగు సరిగా నిలబడటంలేదు. సరాసరిపోయి నారాయణరావుగారింటివద్ద ఆగాడు.

"నారాయణరా వున్నాడా?" ప్రశ్నించాడు కనురెప్పలు బలవంతంగా తెరుస్తూ. నారాయణరావు ధర్మపత్నికి ఒళ్ళుమండింది ఆ ఏకవచన ప్రయోగానికి.

"లేరురా—ఏం?—ఎందుకు?" అన్నది.

"ఆ...ఏమి లేదు లే...నా ఇల్లు బేరం చేత్తాడేమోనని...లేడా?" ఆ నోటినుండి వస్తున్న దుర్వాసన భరించ లేకపోయిందా ఇల్లాలు.

"లేదు పట్నంపొయ్యారు......రాత్రివస్తారు" అంది. ఒక్కక్షణం ఆలస్యం చెయ్యక ఇల్లుచేరాడు. కొలిమికి ఊకపోసి నిప్పంటించాడు.

"ఆగొడ్డలి, మడ్డుకత్తి ఇటివ్వరా తమ్ముడూ" అన్నాడు కుక్క కేసిచూస్తూ. చొంగకార్చుకుంటూ, నాలుకచాచుకొని అంతేచూస్తూ కూర్చుంది కుక్క.

"అదేట్రా? అట్టాచూత్తావ్ గొడ్డలిమ్మంటే.. ఈరోజుతో కొలిమి ఆఖర్రో. రేపటిమంచి నువ్వు సాశ్వితంగా పండుకోరా......నీకే రాసిచ్చిపోత" అంటూ గండ్రగొడ్డలి, మడ్డుకత్తి కొలిమిపొయ్యిలో పెట్టి ఎఱ్ఱగా భయావహంగా కాల్చాడు. బయటికితీసి సమ్మెటతో వాటి మొనలు పల్చగా చరిచాడు. సానరాయి తెచ్చి పదును పెట్టసాగాడు. సానకల్లుమీద పదును పెట్టడంతో, పాదరసంలా మెరువసాగాయి. గొడ్డలి చేతబట్టి అటూ ఇటూ త్రిప్పసాగాడు. తళుక్కు తళుక్కున పామువడగమీద మణిలా కాంతులు వెదజిమ్మింది. గోటిపై పదునుపరీక్షించి సంతృప్తి చెందాడు. ఆసంతృప్తికి తార్కాణంగా భయంకరమైన నవ్వు నవ్వి ఏదో అస్పష్టంగా గొణికి..."కమ్మరి కోటయ్య కొడుకునే కాదు" అని ప్రతిజ్ఞ చేశాడు.

పట్టణంపొయ్యేగొడ్డు ఆ గ్రామంనుంచి రెండు మైళ్ళు. ఇప్పుడాత్రోవంతా బురదతో, రాళ్ళతో కసాటుగా ఉంది. ఊరిబయట చింతలతోపు పట్నం నుంచి తిరిగి రావటానికి, పోవటానికి ప్రతివ్యక్తీ అతోపులో అడుగుపెట్టక తప్పదు. శివంపూనినట్లు ఆవేశంతో ఆ గండ్రగొడ్డలి భుజంపైనిడుకొని, బురదలో, వర్షంలో ఆతోపులోకి పరుగెత్తి ఒక చింతమానుపై చేరాడు.

కన్నుపొడుచుకున్నా కనపడనంత అంధకారం నలుమూలలా క్రమ్ముకుంది. పొలాల్లో పోసిన ఎరువు మట్టి మాగిపోయి కుళ్లుకంపుకొడ్తోంది. వేసవిలో నెఱ్ఱె కొట్టినచేలు నీరుపోసుకుంటున్న శబ్దం అవిరామంగా వినవస్తోంది. ఆహారసేకరణకై సంచరిస్తూన్న పామునోటిలో పడినకప్ప ఆర్తనాదం వినవస్తోంది. గాలి వీచినప్పుడల్లా చింతచెట్లనుండి రాలుతున్న లావుపాటి చినుకులు గడుసుదయ్యాలు రాళ్లువిసిరి, దోబూచులాడుతున్నట్టుగా ఉంది. ఆదృశ్యం తలచుకుంటే నే రోమాంచితమౌతోంది శరీరం. నానా భీభత్సంగా వుందా చింతలతోపు.

పట్నంనుంచి నారాయణరావుగారు ఇద్దరు ప్రక్కవూరివారితో కలిసి వస్తున్నాడు. ఆ చింతల తోపుచేరగానే "ఇక మాకు శెలవిప్పించండి...ఊళ్లో కొచ్చారుగా" అంటూ చుట్టలు ఊదరపట్టుకొని వీడ్కోలుచెప్పి ప్రక్కనున్న త్రోవనే వెళ్లిపొయ్యారు వాళ్లిద్దరూ.

నిర్మానుష్యనిశీథం—వర్షం—చలిగాలి...పట్టపగలే భీతిగొలిపే ఆతావులో అడుగుపెట్టాలంటే నారాయణరావుగారికి కాలుసాగలేదు. వెనుక ఎవ్వరైనా వస్తూన్నారేమోనని ఆ చింతచెట్టుక్రింద నిల్చుని ఆశాపూరిత దృక్కులు బరిపాడు ఆ నిశీథంలోకి. చెట్టుపైనుండి దూకినశబ్దం విని వులిక్కిపడ్డాడు. ప్రక్కకు తిరిగాడు. కారుమేఘాలను చించుకొని మెఱిసిన మెఱుపుకాంతిలో ఆ వ్యక్తిముఖం, గొడ్డలి స్పష్టంగాచూసి "వీరయ్యా" అని పరుగెత్తసాగాడు. ప్రళయకాలరుద్రుడై విసిరాడు గండ్రగొడ్డలి వీరయ్య. ...బురదలోపడి విలవిలా తన్నుకున్నదా శవం.

వీరయ్యకు బేడీలు తగిలించారు. కోర్టులో విచారణ జరిగింది. హంతకుడు నేరాన్ని అంగీకరించలేదు. వీరయ్య ప్రతిపక్షానికి సాక్ష్యం చెప్పటానికి సిద్ధమైన వారికొక సందేహం కల్గింది. ఒకవేళ వీరయ్య జైలునుండి తిరిగివస్తే ఎలా అని తటపటాయించి సర్దుకున్నారు.

ఎలానో మరణశిక్ష తప్పి ఇరవై సంవత్సరాల కారాగార వాసం విధించబడింది. ఆ ఇరవై సంవత్సరాల శిక్ష జెయిలరుపై వీరయ్య తీసుకున్న చర్యతో ఐదు సంవత్సరాలు పొడిగింపబడింది.

వీరాస్వామి, భూస్వామి నారాయణరావు పట్లదుర్మార్గంగా ప్రవర్తించాడు. అమానుషకృత్యం చేశాడు.

కాని నారాయణరావు స్వేచ్ఛగా బ్రతికివున్న రోజుల్లో అన్యాయంగా అక్రమంగా ప్రవర్తించి, అమాయకులను ఏదో నేరంలో ఇరికించి, దొంగ ప్రొనోట్లు పుట్టించి వారి ఆస్తిపాస్తులు తనవశం చేసుకున్నాడు. అయితే వీరాస్వామిలా ఎవ్వరిపైనా క్రౌర్యం చూపలేదు. కలంకాగితంతో కోర్టుద్వారా పనులు చేయించుకొన్నాడు. నారాయణరావులో ఆ ప్రశాంతత, గంభీరత పిరికితనం కావచ్చు...ఆత్మసంయమనం కావచ్చు.

దుర్మార్గం జరగకుండా చూడటం, అపరాధిని శిక్షించటం బాగానేవుంది. న్యాయశాస్త్రరీత్యా చట్టం ప్రకారం వీరాస్వామిని కొన్ని దశాబ్దాలతరబడి కారాగారంలో నిర్బంధించారు. కఠిననరకం విధించారు. నున్నగా తలగొరిగించారు. చాలీచాలని గళ్ల చొక్కాలు వికారంగా తొడిగారు. గానుగ లాగించారు. ఎన్ని విధాల అవమానం చెయ్యటానికి సాధ్యపడుతుందో అన్నివిధాలా 'మానభంగం' చేశారు. అపరాధిని శిక్షించటం కోసం ఇన్నిమార్గాలు సృష్టించినా ఆశించిన ఫలితం కలుగలేదు...శిక్షద్వారా భావపరివర్తన కలుగలేదు. పైగా వీటన్నిటికి ఫలితంగా ఆ దుర్మార్గపు చేష్టలు, హత్య చెయ్యటానికి కావలసిన మూర్ఖత్వం, కక్ష, ద్విగుణీకృతమై జీర్ణించుకుపొయ్యాయి. ఈ మానసిక ప్రవృత్తులు "ఇక బ్రతికి ప్రయోజనం లేద నే నిరాశ"తో పెనవేసుకొనిపోయి పరాకాష్ఠనందుకున్నాయి. ఆ పరిస్థితుల్లో నే వీరాస్వామి జెయిలరును హత్యచెయ్యటానికి ప్రయత్నించాడు.

వయస్సొచ్చినతరువాత జీవితమంతా ఖైదీగా గడిపివేశాడు. అన్నివిధాలా పూర్తిగా భ్రష్టుడైపోయిన తరువాత స్వేచ్ఛగా విడుదలచెయ్యబడ్డాడు ఆ దిక్కుమాలినసత్రానికి.

* * * *

రెండోఆట సినిమా విడిచిపెట్టేవేళ కావస్తోంది. ఖాళీరిక్షాలు రోడ్డుపక్కకు లాగి ముడుచుకొని వాటిల్లోనే పడుకున్నారు రిక్షావాళ్ళు. ఇద్దరుస్త్రీలు చక్కగా అలంకరించుకొని రోడ్డుమలుపులో ఎవరికోసమో నిరీక్షిస్తున్నారు.

'గుంటగ్రౌండ్స' దగ్గరనున్న ఆబ్లూలైటు అరుగుపై వీరాస్వామి తప్పత్రాగిపడి ఉన్నాడు. శోకతప్తయైన ఒక వనిత చెంతనే రాగాలాపన చేస్తోంది. దుఃఖితస్వరాన సింహాద్రి ఒక చేతితో వీరాస్వామిని గట్టిగా రెక్క వెనుకకు మడిచిపట్టుకొని ఆమెను ఓదార్చుతున్నాడు. నలుగురూ పోగయ్యారు. ఒకవ్యక్తి ధర్మరక్షణార్థమై పరుగెత్తికొనిపోయి పోలీసులను ప్రవేశపెట్టాడు.

"ఒక్కటేనా తెంచింది" ప్రశ్నించాడు పోలీసు.

"అవునండీ ... ఒక్క గొలుసేనండీ...అంతలోనే నాకు మెలుకువవచ్చి పెద్దగా అరిచానండీ...ఆ అరుపుకు మావారులేచి వెంబడిపడ్డారండీ..." ఏడుస్తూనే సమాధానమిచ్చింది.

"ఇప్పుడేదా సొమ్ము?" అన్నాడు పోలీసు.

"ఇదుగోనండి" అని తెగిపోయిన ఓ కంఠహారాన్ని చూపించాడు సింహాద్రి.

"సరే నీ పేరు?"

"నా పేరు రామారావండి" వినయంగా చెప్పాడు సింహాద్రి.

"నీ భార్య పేరు?"

"సత్యవతి" జవాబిచ్చింది ఆ వనిత తల ఆడించుకుంటూ. ఇంకా 'వీరాస్వామి'ని వెంబడించిన ముగ్గురు పేర్లు 'నోట్' చేసికొని మీరంతా రేపు తాలూకా ఆఫీసులో హాజరుకండి" అని ఆదేశించి 'వీరాస్వామి' చేతికి బేడీలు తగిలించారు పోలీసులు.

జిల్లాకోర్టు వెనుకనున్న ఆభవనప్రాంగణంలో అడుగుపెట్టటంతో "అమ్మయ్య"అన్నట్టు ఒక నిట్టూర్పు విడిచాడు వీరాస్వామి. జన్మభూమిలో అడుగుపెట్టి ఒక్కొక్క చీకటికొట్టు దాటుతుంటే ఒక ఖైదీ ఇనుపచువ్వలమధ్యగా తలదూర్చి "నీయుంత, నీగంజి బొచ్చ ఎదురుచూస్తున్నయి రోయి" అని స్వాగతం పలికాడు. కిర్రున ఒక ఇనుపచువ్వలగేటుతీసి, లోపల ప్రవేశపెట్టారు వీరాస్వామిని. ఆనందాశ్రువుల్లా రెండు కన్నీటిబొట్లు ఆపుచ్చు వదనంపై జారాయి. కాళ్లు తేలిపోతున్నాయి. గుండెలో పోటుగావుండి బాధగా నేలపై కొరిగాడు...

సుప్రభాతానికి విముఖత్వం చూపుతూ జైలు గోడలో దూరింది గుడ్లగూబ జారులూ, చోరులూ, త్రాగుబోతులూ, రోడ్లు ఖాళీచేస్తున్నారు. విచారణకై హాజరుపరచవలసిన ఖైదీలను ఆయత్తపరుస్తూ వార్డెన్ 'వీరాస్వామి' గదిలోకి తొంగిచూశాడు.

వీరాస్వామి అర్ధనిమీలిత నేత్రాలతో నిశ్చలంగా చూస్తున్నాడు. అచంచలంగావున్న ఆ భౌతిక దేహపు కనురెప్పలు ఎంతసేపటికీ మూతపడకపోవటం చూసి "అమ్మో" అని గావుకేక పెట్టి పరుగెత్తాడు వార్డెన్.

'సైరను' లేచి పెద్దగా ఆవులించి, మళ్ళీ పడుకుంది.